
# ఆరని పొయ్యి



ఇద్దరు తమ్ముళ్ళతో పాటు విజయనగరం వెళ్ళి ఆమంచివారి వీధిలో చిన్న ఇల్లు అద్దికి తీసుకున్న నల్లమిల్లి సూర్రెడ్డి విజయనగరం జిల్లాలో ఉన్న పద్మనాభం, రాజపులోవల్లో ఉన్న రాజుల మామిడితోటలు కౌలుకి తీసుకుని తమ్ముళ్ళతో పాటు ఆ తోటల్ని జాగ్రత్తగా చూసుకుంటా వాటికి పురుగు పట్టకండా తెగుళ్ళు రాకండా మందూ అదీ కొట్టి సాగు చేస్తున్నాడు.

ఆ మొదటేడు బాగా వచ్చిన పూత గాలిదుమారం అదీ రాకపోడంతో రాల్లేదు. మంచిపంట బంగినపల్లి, రసాలూ, కోలంగోవా బాగా దిగినియ్యి. అన్నిటికంటే పంట తక్కువ రేటెక్కువయిన ఇమామ్ పసందు(వాళ్ళంతా విమానం పసందు అంటారు)కూడా బానే దిగింది.

లాభాలు బాగా రావడంతో సూర్రెడ్డి శిస్తుల్ని రాజుల ఇళ్ళకెళ్ళి మరీ ఇచ్చిచ్చొచ్చాడు. దాంతో, ఆ ప్రాంతంలో మంచి పేరొచ్చేసిందతనికి. చీపురుపల్లి, రణస్థలం, దాసన్నపేట నించి సంకిలి, కింతలి, పీర్లకోనేరూ లాంటి ఊళ్లనించి పనిగట్టుకు మరీ దిగిపోతున్న రైతులు మాతోట లీజుకి తీసుకోండి రెడ్డిగారూ అంటే మా తోట లీజుకి తీసుకోండి అంటున్నారు. ఒకవిధంగా బతిమాల్తున్నారుకూడా.



దాంతో,

ఆ ఏడు కొన్ని వందల ఎకరాల తోటల్ని కౌలుకి తీసేసుకున్న సూరెడ్డి మా ప్రాంతంలో లేవరకంతో బాధపడ్తున్న బంధువుల కుర్రోళ్లని అందులోనూ నల్లమిల్లోళ్ళని మట్టుకే విజయనగరం తీసుకుపోయి తోటల్లో మకాంలు పెట్టించి "ఈతోట నాదిగాదురా మీది మీ తోటని మీరు జాగ్రర్తగా చూసుకోండ్రోయ్" అనేసి అప్పగించేడు.

బంధువుల కుర్రోళ్లు "నాది" అనుకుని కష్టపడ్డం వల్లయితేనేం, సూర్రెడ్డిగారి అదృష్టం బాగుండటం వల్లయితేనేం రెండో ఏడు మొదటేడు కంటే బాగా వచ్చింది పంట. ఈమూడో ఏడు పంట ఆ రెండేళ్ళనీ మించిపోయింది.



దాంతో,

అంబటిసత్రం దగ్గర రెండువేల చదరపు గజాల స్థలం కొని పెద్దడాబాఇల్లు కట్టించేసి కాపురాలు పెట్టేసేడు నల్లమిల్లిసూర్రెడ్డిగారు.

సూర్రెడ్డిగారి భార్యపేరు వెంపర్తమ్మ.

ఆరోజు కార్తీకసోమవారం. రాహుకాలం మధ్యాన్నం ఒంటి గంటన్నర నించి మూడుదాకా, అమృత ఘడియలు ఉదయం ఆరూ నలభై మూడు నించి తొమ్మిదీ ఆరు నిమిషాల దాకా, వెంపర్తమ్మగారు నిన్న అర్ధరాత్రి దాటాకా రాజమండ్రిలో ఎక్కిన పూరీ పాసింజరు విజయనగరం స్టేషన్లో ఆగేసరికి పొద్దుట ఏడుదాటింది.

ఇంట్లో అడుగెట్టిన వెంపర్తమ్మగారు సామాన్లు సర్దే పన్లన్నీ తోటికోడళ్ళ కప్పగించి సరాసరి వంట గదిలోకెళ్ళి పొయ్యి ఎక్కడుందో చూసి అది ఉండాల్సింది ఇక్కడకాదు ఆగ్నేయం మూలని చెప్పి ఓ పాతిక ఇటుకలు తెప్పించి తనే స్వయంగా పొయ్యికట్టి ఆవుపేడతో అలికి ముగ్గులెట్టి అమృతఘడియలు దాటేలోపే నిప్పంటించి పాలు పొంగించి పరవాన్నం వండి ఇంటిల్లపాదికీ పెట్టింది.

అంతలో వచ్చిన తోడికోడళ్ళు ''అక్కయ్యా మధ్యాన్నం వంటేం చేస్తారు?'' అన్నారు.

''మంచి వంకాయలు తెప్పించండి... ఇవాళ్టికి అత్తెసరు పచ్చిపులుసును చేసేద్దాం'' అంది వెంపర్తమ్మగారు.

ఆ మధ్యాన్నం ఇంట్లో అందరితో పాటు చుట్టుపక్కల ఊళ్ళనించి వచ్చిన జనాలకి కూడా లేత అరిటాకులేసి స్వయంగా వడ్డిస్తూ ''చూడండిబాబూ...ఎలాంటి మొహమాటం పడకండా అడిగి మరీ వేయించుకోండి. ఇవేళ పచ్చిపులుసొక్కటే చేసేనని ఇబ్బంది పడొద్దు. రేపొస్తే అన్నీ వండి పెడతాను'' అంటూ వడ్డించడం మొదలెట్టింది.

ఆమె చేతివంట గురించి తెల్సిన ఇంట్లోవాళ్ళు సరే బయటోళ్ళయితే ''అదో అమృతం'' అని పచ్చిపులుసుముద్ద దోర్చడం మొదలెట్టేరు.

సూర్రెడ్డిగారి దగ్గరకి ఒక మనిషొచ్చి ''రామభద్రపురం నించీ సాలూరు నించి రైతులు వస్తున్నారు మిమ్మల్ని కలవడానికి'' అనెళ్ళాడు.

వెంపర్తమ్మ దగ్గరకొచ్చిన సూర్రెడ్డి ''వాళ్ళెవరో వస్తున్నారట మనల్ని కలవడానికి'' అన్నాడు.

''ఈ వేళప్పుడొస్తున్నారు. అన్నాలు తిన్నారోలేదో'' అంది వెంపర్తమ్మగారు.

''అదే నాకూ అనుమానంగా ఉంది'' అన్నాడు.

గబగబా వంటగదిలోకి పరుగెట్టింది.

మధ్యాన్నం ఒంటిగంటన్నరకి వచ్చిన వాళ్ళ భోజనాలవుతుండగానే లేదో పీర్లకోనేరు తోటల్లోనూ, చిట్టువలస తోటల్లోనూ కాపలా ఉండే కుర్రోళ్ళు ట్రంకుపెట్టెల్తో పాటు దిగిపోయి ''పాలమూరెళ్ళి రెండ్రోజుల్లో వచ్చేస్తాం మాయ్యా'' అన్నారు సూర్రెడ్డితో.

అప్పుడే అక్కడికొచ్చిన వెంపర్తమ్మ ఆకుర్రోళ్ళలో ఒకడ్ని గుర్తు పట్టి ''ఒరే నువ్వు అమ్మిరెడ్డి అన్నయ్యగారి ఆఖరోడివి గదా?'' అంది. ''అవునత్తయ్యా'' అన్నాడు కుర్రోడు.

''నీ పేరేంట్రా?'' అంది.

''వెంకట్నారాయణరెడ్డి'' అన్నాడు.

''ఎండనపడొచ్చేరు అన్నం తిన్నారా?'' అంది.

వాళ్ళు ''లేదు'' అన్న వెంటనే ఉన్న ఫళాన వంట చేసి వాళ్ళకి పెట్టడంతో పాటు దిబ్బరొట్టే కాల్చి పొట్లాలు కట్టి ''రాత్రి రైల్లోకి టిపినీ'' అనందించింది.

సరిగ్గా మూడింటికి వైజాగు పూర్ణామార్కెట్లోనూ కురుసాం మార్కెట్లోనూ హోల్‌సేల్ వ్యాపారం చేసే షావుకార్లు ''మీసాలరాజుగారి మిలట్రీ హోటలు కెళ్ళొచ్చేకా మాటాడుకుందాం'' అన్నారు సూర్రెడ్డితో.

''మనింటికొచ్చి ఒటేల్లో తినడమేంటి ఓ గడువు కూర్చోబెట్టండి'' అంది వెంపర్తమ్మ.

ఆలశ్యంగా వాళ్ళ భోజనాలయ్యేసరికి సాయంత్రం నాలుగయ్యింది.

అన్నం తిని ఓ కునుకుతీసి వచ్చిన తోడికోడళ్ళు ''అక్కయ్యా! పలహారం మాటేంటి?'' అన్నారు.

''మసాలాగారెలు వేద్దామా? పకోడీ వేద్దామా?'' అడిగింది వెంపర్తమ్మగారు.

''మీచేత్తో ఏం చేసినా బానే ఉంటాయి గదా?'' అన్నారు వాళ్ళు.

''మసాలాగారెలేద్దాం. ఉల్లిపాయలు చీలికలు కింద కోసి పిండిలో ఎక్కువ కలపండి రుచి పెరుగుద్ది. ఎవరి దొడ్లోకన్నా వెళ్ళి లేత అరిటాకులు రెండు కోసుకురమ్మనండి'' అని పన్లోకి దిగింది వెంపర్తమ్మగారు.

దీపాలవేళయ్యింది.

మళ్ళీ రాత్రికి ఎసరు గిన్నె ఎక్కించింది పొయ్యిమీద.

రాత్రి భోజనాలకి కూర్చోబోతుండగా ''మర్చిపోయావా ఇవ్వేళ నాకు ఉపవాసం'' అన్నాడు సూర్రెడ్డిగారొచ్చి. వెంటనే మూకుడు పెట్టి ఉప్పుడు పిండి చేసింది.

పక్కలు సర్దుతున్న టైములో కలకత్తా హోల్‌సేల్ మార్కెట్లో శేరులు దిగేరు. ఈ మధ్య సూర్రెడ్డికి బాగా దోస్తుల అయ్యేరీశేట్లు. మామిడిపళ్ళ లారీ వెళ్తే వెంటనే డబ్బు కట్టి డౌన్‌లోడు చేసుకునే మనుషులు వాళ్ళు. అయితే వాళ్ళకి కాస్త పుచ్చుకునే అలవాటుంది. నల్లమిల్లిసూర్రెడ్డిని కూడా పుచ్చుకోమని బలవంతం చేస్తే చాలా ఇబ్బంది పడ్తా ''ఆడోళ్ళు ఇవేళే దిగేరు ఊర్నుంచి'' అంటానే... నానుస్తా పుచ్చుకోడం మొదలెట్టేడు.

తాగుతున్న కలకత్తా శేరులు మధ్యలో ఎండుచేపల వేపుడనేసరికి వంటగదిలో కొచ్చిన సూర్రెడ్డి ''ఆ సంగతి చూడు'' అన్నాడు.

ఇంకాస్సేపయ్యేకా కోడిమాంసం వేపుడన్నాడు.

మళ్ళీ వంటగదిలో కొచ్చిన సూర్రెడ్డి ''కుదురుద్దా మరి?'' అన్నాడు.

ఇదంతా అయ్యేసరికి తెల్లవారు ఝాము మూడయ్యింది.

వెంపర్తమ్మగారు ఎప్పుడు తిందో ఎప్పుడు పడుకుందో, మండుతున్న ఆపొయ్యి మీద నవ్వుతా ఇడ్లీ పాత్ర పెట్టింది. ఆ తర్వాత ఇనప మూకుడెట్టి పూరీలు పొంగించింది. రెండురకాల పచ్చళ్ళు, పూరీకూర కూడా చేసింది. ఇదంతా అయ్యేసరికి తూరుపున ఎర్రవారి తెల్లవారింది.

* * *

వెంపర్తమ్మగారు విజయనగరంలో దిగిన ఆ ఇరవై నాలుగుగంటల్లో జరిగినట్టే తర్వాత రోజుకూడా జరిగింది. ఆ తర్వాత రోజు, దాని

తర్వాత రోజు, ప్రతీరోజూ అంతే.

ఒకసారి ఓకుర్రోడు ''వారాలు చేసుకుంటున్నాను ఆదివారం పూట మీ ఇంటికి రమ్మంటావా అమ్మా'' అంటే ''తప్పకుండా రా బాబూ!''అంది. ఒక ముసలిసాధువుగారిని వారానికో రోజు భోజనానికి తనే పిలిచింది. రాత్రిపూట అన్నపూర్ణ కావిడి సాధువుకి తప్పకండా అన్నమేసేది. ఒకసారి ఎవరో సాములోరు శిష్యుల్తో పాటు దిగిపోయి చాల్రోజులుండిపోయేడు.

వేళకాని వేళ, అర్ధరాత్రీ అని లేకండా మనుషులొచ్చి భోజనాలు చేసి వెళ్తూనే ఉన్నారా ఇంట్లో. ఏనాడూ ఏ మనిషినీ పల్లెత్తు ముక్క అన్న పాపాన పోలేదు వెంపర్తమ్మగారు. కనీసం విసుక్కుని కూడా ఎరగదు.

తుఫానొచ్చింది. సుళ్ళు తిరగకొడ్తుంది గాలి.

ఫూల్‌బాగ్‌లోనూ, భేరీచావిడి దగ్గరా పాతకాలం కట్టడాలు నేలకూలుతున్నాయి. రాజాం అవతల ఊరు ఊరే మునిగిపోయింది. గజపతినగరం అవతల ఓ వంద పశువులు నీళ్ళలో కొట్టుకుపోయి అయిపులేకుండా పోయినియ్యట. కోరుకొండ దగ్గర ఆకాలంలో కట్టిన రాజుల జేగురురంగు విశ్రాంతి భవనం కుప్పకూలిపోయిందట. కరెంటు తీగలు తెగిపోయినియ్యి స్తంభాలు నేలమీదికి ఒంగిపోయినియ్యి. ఊళ్ళో ఎక్కడ చూసినా నీళ్ళు... నీళ్ళు...

పగలే చీకటిలాగుంది. ఆ చుట్టుపక్కల వీధుల్లో జనమొచ్చి సూర్రెడ్డిగారింట్లో తలదాచుకుంటున్నారు. వాళ్ళందర్నీ పేరు పేరునా పలకరించిన వెంపర్తమ్మగారు అందరికీ వండి వడ్డిస్తుంది.

వారం పదిరోజులు దాటినా తగ్గడం లేదు వర్షం. పొయ్యిలో పెట్టడానికి పుల్లలయిపోయినియ్యి. బయట పుల్లలఅడితీల్నిండా నీళ్ళు. ఆ నీళ్ళలో తేల్తున్నాయి పుల్లలు.

దాంతో, ఇదిగాదు పనని జెప్పి ఇంటి తలుపులూ, ద్వారబంధాలూ పీకించి పొయ్యిలో పెట్టి మరీ వంట చేసింది.

* * *

ఛాలా ఏళ్ళు గడిచినియ్యి.

ముసలరకం వచ్చేసిన వెంపర్తమ్మగారు ఏ జబ్బు రాకుండానే ఆరోజు నిద్దట్లో చనిపోయింది.

దొడ్లో శవం అటు పక్కనుంది. ఇటుపక్క మండుతున్న పొయ్యిమీద శవానికి స్నానం చేయించడానికి నీళ్ళు కాగుతున్నాయి. ఆ మండే పొయ్యి దగ్గరకెళ్ళిన సూర్రెడ్డిగారు ఆమె జ్ఞాపకార్థం ఆ పొయ్యి ఎప్పటికీ వెలుగుతూనే ఉండాలని ఆ ఇంట్లో ఎప్పుడూ వంటలూ వడ్డనలూ జరుగుతూనే ఉండాలని ఆజ్ఞాపించేడు.

ఇది ఎన్నో ఏళ్ళనాటి మాట. సూర్రెడ్డిగారు కానీ ఆయన తమ్ముళ్ళుగానీ వారి భార్యలుగానీ ఎవరూ ఇప్పుడు లేరు. వాళ్ళంతా చనిపోయి చాలా ఏళ్ళయిపోయింది. కానీ,

ఆనాడు వెంపర్తమ్మగారు వెలిగించిన ఆ పొయ్యి ఇప్పటికీ వెలుగుతూనే ఉంది.

* * *